ఘటరాధాకృష్ణశాస్త్రి



# అయ్యా! నాకో బండి కొనిపెట్టవూ.

తోపుడు బండి.

నాలుగు చక్రాల తోపుడుబండి...

నాణ్యమైన తోపుడుబండి...

దేవళం పక్కన మైదానంలో పిల్లలంతా చేరారు. వాళ్ళ మధ్య ఓ తోపుడు బండి ఉంది. ఆ బండి డాక్టరు గారబ్బాయి గోపీది. తోపుడు బండిని ప్రతిరోజూ ఆటస్థలానికి చేర్చి ఆట పూర్తయ్యాక దాన్ని మళ్ళీ భద్రంగా డాక్టరుగారింట్లో అప్పగించే బాధ్యత రిక్షాలాగే గోవిందు కొడుకు మల్లేశుది. బండిలో ఎక్కి కూర్చునే అర్హత మాత్రం మల్లేశుకు లేదు.

"స్టార్ట్."

పచ్చజెండా గాలిలో రెపరెపలాడింది. ఒక అబ్బాయి కులుకుతూ విజిల్ వేశాడు. పిల్లలందరూ సంతోషంతో చప్పట్లు కొట్టడం ప్రారంభించారు.

"నెట్టరా," అన్నాడు గోపీ బండెక్కి కూర్చొని.

జారిపోతున్న షరాయి నెగదీసుకొని అరచేతుల్ని నేలమీద రుద్ది, శరీరంలోని శక్తినంతా చేతుల్లోకి తెచ్చుకొని బండిని నెట్టడం ప్రారం చాడు మల్లేశు. దేశంలో పెత్తందారీతనం బండెక్కి కూర్చుంటే క్రిశక [illegible] దాని పురోగమనానికి శా [illegible] శక్తులా పాటుబడుతున్నట్లుందా బండితోపుడు దృశ్యం.

"స్టాప్."

ఎర్రజెండా గాలిలో అటూ ఇటూ ఊగింది. శివాలయాని కెదురుగా మర్రి మాను దగ్గర బండి ఆగింది. నుదుటి మీద చెమటను చేత్తో తుడుచుకొని రెండు నిముషాలు అలుపు తీర్చుకొని బండిని నెట్టుకుంటూ మళ్ళీ బయల్దేరిన స్థలానికి వచ్చేశాడు మల్లేశు.

గోపీబాబు బండి దిగాడు. తర్వాత మరో బాబు బండెక్కాడు. తర్వాత ఛాన్సు మరో అబ్బాయిది. ఆ తర్వాత ఇంకొకడు. మల్లేశు బండెక్కి కూర్చుంటే నెట్టేవాళ్ళెవరూ లేరు.

చీకట్లు చిందులు తొక్కుతూ శివాలయం పక్కన మర్రిచెట్టు ఊడలకు చుట్టుకొని గుత్తులు గుత్తులుగా వ్రేలాడటం ప్రారంభించినై. వీధుల్లో మున్సిపాలిటీ దీపాలు వెలిగాయి. శివాలయంలో దేవుడికి సాయంత్రం ఆరున్నరకే ఆకలేసింది కాబోలు పూజారి గణగణ గంట వాయిస్తున్నాడు. పిల్లలందరూ ఆట చాలించి జట్లు జట్లుగా చీలి ఇళ్ళకు వెళ్ళిపోవటం ప్రారంభించారు. తోపుడు బండిని డాక్టరుగారింట్లో ఆయాకు అప్పగించి మల్లేశు కూడా గుడిసె చేరుకున్నాడు.

"తొయ్యరా, తొయ్."

"నెట్టరా, నెట్టు."

"స్టార్ట్," సన్నగా విజిల్ మోగింది.

"స్టాప్." గాల్లో ఎర్రజెండా రెపరెపలు.

"భలే భలే బండీ." ఆ రాత్రి మగతనిద్రలో మల్లేశు కలవరిస్తున్నాడు.

"మల్లిగా ! ఒరే మల్లిగా ! ఏంట్రా కలవరిస్తున్నావు?" మల్లేశు జబ్బలు పట్టుకొని ఊపుతూ అడిగాడు గోవిందు.

"ఊ," అంటూ మూలిగాడు మల్లేశు.

"ఏంట్రా ఎర్రి సన్నాసీ?"

"అదే నయ్యా తోపుడు బండీ. అయ్యా ! నాకో బండి కొనిపెట్టవూ."

"ఆ బళ్ళు గిళ్ళు అయ్యోళ్ళ డబ్బునోళ్ళకురా. మన కెందుకురా. పిచ్చి సన్నాసీ పడుకోరా పడుకో." సమాధానం చెప్పాడు గోవిందు.

''మనకాడ డబ్బు లేదటయ్యా?" అంటూ తండ్రిని ప్రశ్నించాడు మల్లేశు ఆశ్చర్యంతో.

"డబ్బా? మనకాడనా?" అంటూ నవ్వి నిద్ర కుపక్రమించాడు గోవిందు.

ముంతలో నీళ్ళు గుక్కెడు గొంతులో పోసుకొని ఆలోచించటం మొదలెట్టాడు మల్లేశు. ఈ అయ్య ఎప్పుడూ అంతే. మొన్న ఉగాది పండక్కి కొత్తబట్టలు కొనిపెట్టమంటే, 'ఇప్పుడు నాకాడ డబ్బు లేదురా. తర్వాత చూద్దాం,' అన్నాడు. ఇప్పుడు తోపుడుబండి కొనిపెట్టమంటే మళ్ళీ అదే మాట...అయినా ఈ ప్రపంచంలో డబ్బంతా డాక్టరుబాబు లాంటోళ్ళదగ్గర ఉండిపోవటానికి తన తండ్రి లాంటోళ్ల దగ్గర లేకపోవడానికి కారణ మేమిటో ఎంత ఆలోచించినా వాడి పసిమనస్సు కంతు పట్టలేదు. రెండు మూడుసార్లు అటూ ఇటూ పొర్లి, దుప్పటి ముసుగును శరీరం నిండా బిగదీసుకొని నిద్ర కుపక్రమించాడు మల్లేశు. మరో పది నిముషాల్లో బాగా నిద్రపట్టింది వాడికి. ఆ నిద్రలో కమ్మని కల. తోపుడుబండి చక్రాలు రొదచేసుకుంటూ వాడి గుండెల మీద పరుగులు తీయటం ప్రారంభించినై. గుడిసెలో ఓ మూల వేప నూనె దీపం నిశ్చలంగా వెలుగుతూ మల్లేశుకు మౌనంగా తన సానుభూతి నందజేసింది.

మర్నాడు సాయంత్రం మామూలుగా తోపుడు బండిని ఆటస్థలానికి నెట్టుకొని వెళ్ళడానికి గోపీవాళ్ళ ఇంటికి వెళ్లాడు మల్లేశు. వాకిట్లో కారు సిద్ధంగా ఉంది. రోడ్డుపక్క సంపెంగచెట్టు నీడలో కూర్చొని డ్రైవరు బీడీ కాల్చుకుంటున్నాడు. గేటుదగ్గర తారట్లాడుతున్న మల్లేశును గోపీ గమనించి, "ఒరే మల్లీ ! నేను మా అమ్మా నాన్నలతో సినిమా కెళ్తున్నాను. బండిని పట్టుకెళ్ళి ఆట పూర్తయ్యాక మళ్ళీ భద్రంగా ఆయా కప్పగించు. సరేనా," అంటూ తోపుడు బండిని మల్లేశు కప్పగించాడు.

బండిని నెట్టడం ప్రారంభించాడు మల్లేశు. 'టక టక శబ్దంతో' వెళ్తోంది బండి. రోడ్డు మలుపు తిరిగాక ఇతోధి కోత్సాహంతో నెడుతున్నాడు బండిని మల్లేశు. గాలిని చీల్చుకుంటూ సర్ మంటూ రోడ్డుమీద వెళ్తున్నది బండి. ఆ స్పీడులో రోడ్డుమీద మనుష్యులూ, వాహనాలూ మల్లేశు కంటికి కనిపించడం లేదు. నాలుగురోడ్ల కూడలిదగ్గర తోపుడుబండి మలుపు తిరిగింది. అంతే. అటువేపునించి మాంచి స్పీడులో వస్తున్న లారీ కీచుమంటూ ఆగింది. డ్రైవరు సడన్‌బ్రేకువేశాడు కానీ లాభం లేకపోయింది పిపీలికం పర్వతాన్ని ఢీకొట్టినట్లు తోపుడుబండి లారీని ఢీకొట్టింది లారీ దెబ్బకు తోపుడు బండి మూడు చెక్కలైంది, మల్లేశు కుడికాలు రెండు ముక్కలైంది.

''అరరే.''

''శివ శివా'', ''ఓర్నాయనో.''

చుట్టూ చేరిన జనం హాహాకారాలు చేశారు. మల్లేశు రక్తంతో నుదుట తిలకం దిద్దుకొంది భూదేవి. ఈ ఘోరాన్ని చూడలేక కొండలమాటున ముఖం చాటుచేశాడు కర్మసాక్షి. రోడ్డు పక్క వేపచెట్టు పండుటాకుల కన్నీళ్ళు జల జల రాల్చింది విచార సూచకంగా. చుట్టూ మూగిన జనాన్ని ఓ మాటు తలెత్తి నిస్సహాయంగా చూసి రక్తపు మడుగులో తర్వాత స్పృహ కోల్పోయాడు మల్లేశు. తెల్లచొక్కాల పెద్ద మనుష్యులు మొసలి కన్నీళ్ళు కార్చి ఆ ప్రదేశంనుంచి చల్లగా జారుకున్నారు. ఆ దారంట వెళ్తున్న ఓ స్టూడెంటు జట్కా బండీ కట్టించి మల్లేశును హాస్పిటల్లో చేర్పించాడు.

కన్నకొడుక్కి కాలు తెగిన కబురందాక రిక్షాను యజమాని కప్పగించి గుండెలు బాదుకుంటూ హాస్పిటలు చేరుకున్నాడుగోవిందు. డాక్టర్లు అప్పటికే మల్లేశు గాయాలకు కట్లుకట్టి తెలివి రావటానికి చికిత్స ప్రారంభించారు. ఆ రాత్రి పన్నెండు గంటలకు మల్లేశుకు తెలివొచ్చి తండ్రిని గుర్తుపట్టి 'నాన్నా,' అంటూ చేతులు చాచాడు. అప్పుడే రక్తస్నానం ముగించి ఒళ్ళు తుడుచుకున్నట్లు పడున్న కొడుకుని చూసి కన్నీరు మున్నీరైనాడు గోవిందు.

మర్నాడు ఉదయం జరిగిన ఆపరేషన్‌లో మల్లేశు కాలు మోకాలికి కొంచెం పైభాగంలో తెగ్గొట్టారు డాక్టర్లు. రెండు వారాల తర్వాత హాస్పిటల్ నుంచి డిస్చార్జి చేశారు. ఈ లోగా గోవిందు ఆరోగ్యంకూడా పూర్తిగా పాడైంది. ఖళ్ళు ఖళ్ళున ఒకటే దగ్గు. అప్పుడప్పుడూ రక్తం కూడా పడుతోంది. డాక్టర్లుపరీక్షించి, "పూర్తిగా విశ్రాంతి తీసుకో. మంచి ఆహారం తిను. రిక్షా తొక్కావంటే చస్తావు," అంటూ సలహా ఇచ్చారు. మళ్ళీ రిక్షా జోలికి పోలేదు గోవిందు.

వారంరోజులు గడిచినై.

ఒకరోజు ఉదయం మల్లేశుకోసం ఓ నాలుగు చక్రాల తోపుడుబండిని తెచ్చి గుడిసెముందు పెట్టాడు గోవిందు.

గుడిసెలో ఈతాకుల చాపమీద పడుకున్న మల్లేశు కళ్ళు ఆనందంతో మెరిసినై.

"ఈ బండి నాకేనా అయ్యా?" తండ్రిని ప్రశ్నించాడు మల్లేశు సంతోషంతో.

"నీకేరా."

"ఏదయ్యా, నన్ను చూడనీ"

బండిని తెచ్చి మల్లేశు ముందు పెట్టాడు గోవిందు. అతికష్టంమీద లేచి కూర్చొని చేతుల్తో బండిని ఆప్యాయంగా తడివాడు మల్లేశు. వాడి కళ్ళవెంట ఆనందబాష్పాలు జలజల రాలినై. ఒక చేత్తో చక్రాన్ని పట్టుకొని గిరగిర

తిప్పాడు. తన అదృష్టదేవత చక్రం తిప్పుతున్నట్లనిపించింది. బండి చిన్న దైనా పొందికగా చూడముచ్చటగా ఉంది. గోపీ బండికంటే తన బండే చాలా బాగుంది.

ముంతలో గంజినీళ్లు గుక్కెడు గొంతులో పోసుకొని, అణా ఇడ్లీలు రెండు మల్లేశుకు తినిపించి రెండు చేతుల్తో వాణ్ణి ఎత్తి బండిలో కూర్చో బెట్టి నెట్టడం ప్రారంభించాడు గోవిందు.

మల్లేశు సంతోషాని కంతులేకుండా పోయింది. నిజంగా తన తండ్రి ఎంత మంచివాడు. ఇన్నాళ్ళూ బహుశా డబ్బు లేక కాబోలు బండి కొనిపెట్టలేదు. ఇప్పుడు డబ్బొచ్చింది గనుక చక్కని బండి కొనితెచ్చాడు.

తోపుడుబండి రోడ్డెక్కింది.

"అయ్యా! రోజూ నన్నిలాగే షికారు తిప్పుతావు కదూ ?'' అడిగాడు మల్లేశు సంతోషంతో ఉక్కిరిబిక్కిరౌతూ.

సమాధానం చెప్పలేదు గోవిందు.

''బండి చాలా బాగుందయ్యా. గోపీ బాబు బండికంటే నా బండే బాగుంది కదయ్యా ?" తండ్రిని ప్రశ్నించాడు మల్లేశు.

ఈ దఫా కూడా సమాధానం చెప్పలేదు గోవిందు.

''మాట్లాడవేంటయ్యా ?'' అని వెనక్కి తిరిగి చూశాడు మల్లేశు. గోవిందు కనుకొలకుల్లోంచి వేడి కన్నీటిబొట్లు రెండు జారి మల్లేశు మొండికాలిమీద పడినై.

"అయ్యా! ఏడుస్తున్నా వెందుకూ?" అడిగాడు మల్లేశు దిగులుగా. పైగుడ్డతో కళ్ళుతుడుచుకొని బండిని నెట్టుకుంటూ వెళ్ళి నాలుగురోడ్ల కూడలిదగ్గర ఆపాడు గోవిందు. రోడ్డుమీద జనం హడావిడిగా అటూ ఇటూ నడుస్తున్నారు. షాపుల్లో బేరసారాలు మామూలుగా జరుగుతున్నయ్. ఓ హోటల్లోంచి రేడియో గొంతు చించుకుంటోంది. చీమలపుట్ట పగిలినట్లు రోడ్డుమీద ఎక్కడ జూసినా ఒకటే జనం.

రావిచెట్టు నీడలో రెండునిముషాలు అలుపు తీర్చుకొని రోడ్డుమీద జనాన్ని రెండు చేతులు జాపి యాచించడం మొదలుపెట్టాడు గోవిందు.

"అయ్యా ! అమ్మా ! కాళ్ళులేని అనాధజీవి బాబూ ! ఒక్కపైసా ధర్మం చెయ్యండి "

ఎలాగైతేనేం, ఒక తోపుడుబండికి సొంతదారు కావాలన్న మల్లేశు కోర్కె అలా నెరవేరింది.